క్లుప్తంగా

బాధితులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలో తెనాలి డబుల్ హార్స్, లెప్రో సొసైటీ ఆధ్వర్యంలో ఐదుగురు కుష్ఠు వ్యాధి బాధితులకు హాస్పటల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసరావు చేతులు మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా లెప్రో సొసైటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ రాధిక మాట్లాడుతూ తెనాలి డబుల్ హార్స్ సంస్థ సహకారంతో 20 మంది కుష్ఠు, బోద వ్యాధి బాధితులకు సూక్ష్మ రుణాలను అందజేశామన్నారు. ఆయా బాధిత కుటుంబాలకు సంబంధించి విద్యార్థుల చదువులకు అండగా నిలుస్తూ ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అసోసియేట్ అబ్దుల్ వహీద్ బాషా, డీపీఎంఓ సత్యనారాయణ, సంస్థ ప్రతినిధులు భోస్లా, రాణి, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

కౌలు రైతులకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్) : జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో కౌలు రైతులకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక అన్నే భవన్‌లో మంగళవారం నిర్వహించిన కౌలు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నూటికి 70 శాతం భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు రుణ కేటాయింపులో బ్యాంకర్లు అన్యాయం చేయడం తగదన్నారు. జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళిక రూ.7,300 కోట్లు కాగా, కౌలు రైతులకు రూ.250 కోట్లు మాత్రమే కేటాయింపులు చేసి చేతులు దులుపుకోవడం దారుణమని విమర్శించారు. కౌలు రైతులకు రూ.2 వేల కోట్లు రుణాలు అందించే విధంగా చర్యలు చేపట్టాలంటూ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు భూ యజమానులతో సంబంధం లేకుండా పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను కోరారు. సమావేశంలో కౌలురైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, నాయకులు డి. కేశవ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ సమన్వయ కమిటీ సమావేశం

ఏలూరు రూరల్ : ఉపాధి హామీ పథకం పనులపై త్వరలో నిర్వహించే సామాజిక తనిఖీ విజయవంతం చేయాలని స్టేట్ రీసోర్స్ పర్సన్ సూర్యచక్రం అన్నారు. ఏలూరు రూరల్ మండల పరిషత్ సమావేశ మందిరంలో సామాజిక తనిఖీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బి.ప్రణవి మాట్లాడుతూ మండలంలో రూ. 15,83,13,974లతో 1,223 పనులు జరిగాయన్నారు. గ్రామస్థాయిలో నిర్వహించే సామాజిక తనిఖీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలన్నారు. సమావేశంలో ఏపీఓ కిషోర్‌తో పాటు మండల పరిషత్ ఇంజినీరింగ్ అధికారులతో పాటు ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన ఇంటి గోడ.. తప్పిన ప్రమాదం

కామవరపుకోట: తుపాను కారణంగా కొన్ని రోజుల నుంచి కురుస్తోన్న వర్షాలతో కామవరపుకోటకు చెందిన నూనె సుబ్బలక్ష్మికి చెందిన పెంకుటిల్లు ఇటుకల గోడ మంగళవారం ఉదయం ఒక్కసారిగా కూలిపోయింది. గట్టిగా శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు భయంతో ఘటనా స్థలానికి వచ్చారు. భర్త మృతి చెందడంతో సుబ్బలక్ష్మి ఒంటరిగా ఆ ఇంటిలో నివాసం ఉంటుంది. అదే ఇంట్లో పక్కగదిలో ఆమె ఉండడంతో క్షేమంగా ప్రమాదం నుంచి బయటపడింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు.

పారిశుధ్యం.. అస్తవ్యస్తం


ఖండ్రికగూడెంలో అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ


బాలయోగి వంతెన వద్ద అధ్వానం


ద్వారకానగర్‌లో దుస్థితి ఇలా..


టైటస్ నగర్‌లో ఓ ఇంటి ముందు నిలిచిన మురుగు


రాణీ నగర్‌లో చెత్తతో నిండి ఉన్న ప్రాంతం


ఏలూరు టైటస్ నగర్‌లో ఇంటి ముందే పంది స్వైరవిహారం

ఏలూరు నగరంలోని ఫిల్‌హౌస్ పేట, కోడేలు, టైటస్ నగర్, బీడీ కాలనీ, లంకపేట, తంగెళ్లమూడి, బాలయోగి వంతెన వద్ద పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. డ్రెయిన్లలో మురుగు నీరు పారక దోమలు విజృంభిస్తున్నాయి. ప్రజలు జ్వరాలు, వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. అధికారులు ప్రధాన కూడళ్లలో అక్కడక్కడా శుభ్రం చేసి కాస్త బ్లీచింగ్ పౌడర్ చల్లించి చేతులు దులుపుకుంటున్నారు. రాష్ట్రంలో డయేరియా మహమ్మారి విజృంభిస్తోన్న నేపథ్యంలో ఏలూరు ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. నగరంలోని వివిధ ప్రాంతల్లో నెలకొన్న అపారిశుధ్య దృశ్యాలివీ.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు


కొత్తబస్టాండ్ పక్కనే దుర్గంధం


బీడీ కాలనీలో పూడుకుపోయిన డ్రెయినేజీ

దేశ రక్షణ కోసమే అగ్నివీర్


అగ్నివీర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : దేశ రక్షణ కోసమే కేంద్ర ప్రభుత్వం అగ్నివీర్ పథకాన్ని అమలు చేస్తోందని సీఆర్ఆర్ అటానమస్ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్ అన్నారు. స్థానిక సీఆర్ఆర్ అటానమస్ కళాశాల ఆడియో విజువల్ హాల్‌లో కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్, సెట్‌వెల్, సీఆర్ఆర్ ఎన్‌సీసీ యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అగ్నివీర్ పథకంపై ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారి ఎన్ సందీప్, జిల్లా నేషనల్ కేర్ సర్వీస్ కోఆర్డినేటర్ పి.ప్రవీణ్ కృష్ణ, సెట్‌వెల్ మేనేజర్ పి.సత్యనారాయణ, మాట్లాడుతూ అగ్నివీర్ పథకం అమలయ్యే పద్ధతి, ఈ పథకాన్ని ఎలా వినియోగించుకోవాలి, సైన్యంలో చేరడంలో ముఖ్య అంశాలు, పథకం ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి ఎ.ధర్మేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్


దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో దోమల నివారణకు కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా ఎమ్మెల్యే బడేటి చంటి ఆదేశాల మేరకు మలేరియా విభాగంతో కలిసి నగరపాలక సంస్థ 14వ డివిజన్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పోణంగిలోని దళితపేట, వెలమపేట, ఎస్సీ కాలనీ, సాయిబు పేట, సవర్ల పేట, కాపుపేట, పాతపోణంగి తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువల్లో కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లోని నీటి నిల్వ ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతీ మాట్లాడుతూ నగరంలో దోమల నివారణకు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివరావు, బోసుబాబు, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాల్, కె.శ్రీనివాసరావు, పి.శ్యామ్, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్త ఉన్నారు.

నేత్రదానం ఆదర్శనీయం


దివంగత బాబూరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న యాదవ సంఘ నాయకులు

దెందులూరు: ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ, యాదవ సామాజిక వర్గానికి సేవలందించడమేకాక మరణానంతరం తన కళ్ల ద్వారా మరొకరికి చూపు ప్రసాదించిన కొలుసు నాగ వెంకట సత్యనారాయణ (బాబూరావు) ఆలోచనా విధానం ఆదర్శనీయమని జిల్లా యాదవ సంఘం నాయకులు అన్నారు. మంగళవారం దెందులూరు బాబూరావు నివాసంలో ఆయన చిత్రపటానికి ఏలూరు జిల్లా యాదవ సంఘం నాయకులు చిదరబోయిన శ్రీనివాసరావు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు శ్రీనివాసరావు, గొర్ల రామారావు, బొట్టా అజయ్, కొలుసు కృపానందం, బోగా రాజేష్, వైఎస్సార్‌సీపీ నేత, దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ కొలుసు గణపతిరావు బాబూరావు సేవలను కొనియాడారు. ఆయన కుమారులు కొలుసు నాని, కొలుసు శివ, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

శ్రీశయనుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి


ప్రమాణస్వీకారం చేస్తున్న శ్రీశయన సంక్షేమ సంఘం కమిటీ

ఏలూరు (టూటౌన్) : ఏలూరు నగర శ్రీశయన సంక్షేమ సంఘం అభివృద్ధికి తన శాయ శక్తులా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు లొట్టి రమేష్ తెలిపారు. ఏలూరు నగర శ్రీశయన కుల సంక్షేమ సంఘ సమావేశం సెంట్రల్ కమిటీ సీనియర్ నాయకులు రుప్పా రాంబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీ టీడీపీ శ్రీశయన సాధికారిక కమిటీ అధ్యక్షుడు పటాన్ల వెంకటేష్ బాబు, ఏపీ రాష్ట్ర శ్రీశయన కమిటీ అధ్యక్షుడు లోడ అప్పారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు సంఘం సంక్షేమం, అభివృద్ధి గురించి మాట్లాడారు. ఏలూరు నగర శ్రీశయన సంక్షేమ సంఘానికి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీకి గౌరవ అధ్యక్షుడిగా కోలా కనకారావు, గౌరవ సలహాదారుడిగా ఓలిపల్లి చంద్రశేఖర్, అధ్యక్షుడిగా లొట్టి రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బోగాది ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శిగా చలపతి ఉమా మహేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పెంటా శ్రీనివాస్, కోశాధికారిగా పూతి రాజు, ఉపాధ్యక్షులుగా పట్నాల మోహనరావు, లొట్టి త్రినాథ్‌రావు, తాబేలు మోహనరావు, సహాయ కార్యదర్శులుగా గుజ్జుల జగదీష్, కోలా బాల సుబ్రహ్మణ్యం, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘ సీనియర్ నాయకులు బుజ్జా భాస్కరరావు, లావేటి రామాంజనేయులు, సింగవరపు ప్రసాదరావు, కోలా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌లో తనిఖీలు


చేపల మార్కెట్‌కు వెళ్లే దారిలో ఆక్రమణలను పరిశీలిస్తున్న పెదబాబు

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ మెయిన్ బజారులోని చేపల మార్కెట్‌లో పరిస్థితులపై ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలుదారులు, పలువురు వ్యాపారుల ఫిర్యాదుల మేరకు ఆయన మంగళవారం చేపల మార్కెట్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. మార్కెట్‌లోకి నడిచి వెళ్లేందుకు వీలులేకుండా పలువురు వ్యాపారులు తమ షాపులను డ్రెయినేజీ దాటి మరీ రోడ్డు సగభాగం వరకు వచ్చి వ్యాపారాలు నిర్వహించడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే ఆక్రమణలను తొలగించడంతో పాటు ప్రతి రోజూ డ్రెయినేజీని శుభ్రం చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ తిరుపతిరావు, టీపీఎస్ సాంబ, నాగమల్లేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తుంపాల రాజగోపాల్, వ్యాపారులు ఉన్నారు.

విద్యుత్ చౌర్యంపై కేసు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని పోలవరం మండలం మనుగోపుల గ్రామంలో కోటం పోచమ్మ అనే వ్యక్తి తన ఇంటి ఏసీకి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్టు గుర్తించి, ఆమెపై కేసు నమోదు చేసినట్టు విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వి.రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమెకు రూ.50,657 అపరాధ రుసుం, రూ.4 వేలు జరిమానా విధించినట్టు పేర్కొన్నారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు సత్యనారాయణస్వామి వ్రతాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్థానిక దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో బుధవారం శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించనున్నట్టు క్షేత్రం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ వ్రత కార్యక్రమంలో భక్తులు సామూహికంగా స్వయంగా వ్రతాలు ఆచరిస్తారని పేర్కొన్నారు.

కోమటిలంకలో మురుగు డ్రెయిన్ ప్రక్షాళన



ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం కొల్లేరు గ్రామం కోమటిలంకలో సర్పంచ్ తెనాలి యోహాన్ మురుగనీటి డ్రెయిన్‌ను ప్రక్షాళన చేయించారు. డ్రెయినేజీ వ్యవస్థ పూడిపోవడంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామంలో మురుగునీరు నిలిచిపోయింది. ఇళ్ల మధ్య మురుగు, వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పడ్డారు. దీనిపై గ్రామ సర్పంచ్ యోహాన్ పారిశుధ్యం సిబ్బందితో పాటు గ్రామ యువకుల సహకారంతో డ్రెయినేజీ ప్రక్షాళన చేశారు. ఇళ్ల మధ్య నిలిచిపోయిన మురుగు కిందకు పారింది. వర్షాకాలం ఎలాంటి ఆటంకాలు లేకుండా మురుగు పారేందుకు పక్కా డ్రెయినేజీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్పీ ప్రతాప శివకిషోర్‌కు శుభాకాంక్షలు


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్‌ను పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు ఇ.శ్రీనివాసరావు, వి.రామకృష్ణ, పి.నాగరాజు, కృష్ణంరాజు తదితరులున్నారు. కోఆపరేటివ్ సొసైటీ అభివృద్ధికి సహాయ సహకారాలు కావాలని కోరారు.

27న రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ వర్క్‌షాప్

దెందులూరు: కాకినాడలో ఈ నెల 27న అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ (ఏఏఎఫ్) రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీల న్యాయవాదుల, జర్నలిస్టుల సమావేశం కాకినాడ పట్టణం డీ-కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్నట్టు చైర్మన్, న్యాయవాది పినిపే వెంకటరామకృష్ణ అన్నారు. జిల్లాల్లో ప్రచారంలో భాగంగా రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ వర్క్‌షాపుపై మంగళవారం అలుగులగూడెం, మలకచర్ల, పెరుగ్గూడెంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులు, న్యాయవాదులు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, విద్యావైద్య అధికారుల మేధావులు హాజరుకావాలని చైర్మన్ వెంకటరామకృష్ణ అన్నారు.

ఆపన్నులకు అండగా ఉంటాం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆపన్నులకు అండగా ఉండడానికి లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఏలూరు సెంట్రల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల రవికుమార్ తెలిపారు. జిల్లాలోని పెయ్యేరు గ్రామంలో అత్యంత వెనకబడిన కుటుంబాల దీనస్థితి తెలుసుకుని వారికి టిఫిన్ బాక్సులు, ప్లేట్లు, గ్లాస్‌లను మంగళవారం పంపిణీ చేశామన్నారు. క్లబ్ ప్రతినిధులు తోట ఎడ్వర్డ్, టి.రాబర్ట్, జి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ధర్నా

బుట్టాయగూడెం: ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం కూలీలు ధర్నా చేశారు. సంఘ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించకపోవడం వల్ల కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కూలీలకు పనిముట్లు, పారలు, గునపాలు, గమేళాలు వంటి పనిముట్లను ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కూలీలు బి.డేవిడ్‌రాజు, రాజు, వెంకటేశ్వరరావు, శామ్యేలు, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	38
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - తిరుపతి	16.00	4830	30